

సూర్య www.suryaa.com

చిత్తూరు తిరుపతి

గురువారం 05 మార్చి 2026






# వాగులో పాగా

రెవిన్యూ అధికారుల కళ్లుగప్పి
ఓ తెలుగు తమ్ముడి దాష్టీకం
ఒక ఎకరా 24 సెంట్ల స్వాహా..
సుమారు రూ.మూడు కోట్ల భూమి స్వాహా

మిగతా 2లో..

**రేణిగుంట మేజర్‌న్యూస్:** తమ ప్రభుత్వం అధికారం ఉన్నప్పుడే అంతో ఇంతో సర్దుకోవాలి. లేకుంటే రాజకీయ నాయకుడికి విలువ ఎక్కడ ఉంటుంది. అదే నిరూపించాడు రేణిగుంటకు పట్టణానికి చెందిన ఓ టిడిపి నాయకుడు. గత ప్రభుత్వంలో మండలంలో ఎక్కడ చూసినా భూదందా అంటూ రాద్ధాంతం చేసిన ఈ నాయకుడు. ఇప్పుడు వారి బాటలోనే నడుస్తున్నాడు. రేణిగుంట మండలంలోని కరకంబాడి లెక్క దాకలో సర్వేనెంబర్ 438/1లో 94 సెంట్ల, 438/2లో 30 సెంట్లు మొత్తం 1 ఎకరా 24 సెంట్లు భూమిని ఆక్రమించి దర్జాగా షెడ్డు నిర్మించాడు. వాస్తవానికి ఈ సర్వే నెంబర్ లో ఉన్నది కాలవ వాగు. తన రాజకీయ అండదండలతో, రెవెన్యూ అధికారులు కల్లుగప్పి వాగుని కబ్జాకు తెరలేపాడు. ఈ అనధికార నిర్మాణానికి రాజకీయ పలుకుబడి ఉపయోగించి వాగు ప్రాంతలో విద్యుత్ మీటర్ బిగించి దర్జాగా తన సొంతం చేసుకున్నాడు. పగులు పనులు చేపించకుండా ఈ ప్రదేశంలో చీకటి పడగానే ఈ ప్రాంతాన్ని కొంచెం కొంచెంగా చదును చేస్తూ మొత్తాన్ని మింగేసే ప్రయత్నం చేస్తున్నాడు.




# రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించండి

## - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** రీసర్వే రెవెన్యూ భూ సంబంధిత అంశాలు ప్రజలతో ముడిపడి ఉంటాయని, వాటిని సకాలంలో పరిష్కరిస్తే చాలా వివాదాలు ఉండవని, పీజీ ఆర్ ఎస్ తదితర గ్రీవెన్స్‌ల ద్వారా, రెవెన్యూ సదస్సుల్లో అందిన పలు భూ సంబంధిత మ్యూటేశన్, సర్వే, పాస్ పుస్తకం, సర్వే నంబర్ సబ్ డివిజన్ తదితర అంశాలపై వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యత గా చేపట్టి సకాలంలో బియాండ్ ఎస్ఎల్ఎ కి వెళ్లకుండా పరిష్కరించాలని, సదరు అంశాన్ని ఉన్నత స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, మరింత బాధ్యతగా అధికారులు పని చేయాలనీ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక

మిగతా 5లో..

4 లో



## ఎవరికోసం.. ఇంత అత్యుత్సాహం

### అవసరం లేని చోట చెక్ డాం నిర్మాణం

4 లో



- 8 ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి రూ.10 కోట్లు
- ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో రహదారులకు మహర్దశ

## చంద్రగిరిలో రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరు

5 లో



### సహజ వ్యవసాయ కొనుగోలు-అమ్మకందారుల

## నెట్‌వర్కింగ్ సమావేశం

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్.** చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామపంచాయతీ సర్పంచ్ గత వైసిపి ప్రభుత్వంలో సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి అనేక ఆక్రమణలకు అడిగే వారు లేరని తెర లేపారు, గత ప్రభుత్వంలో జరిగిన పేరూరు పంచాయతీ పరిధిలో ఆక్రమణలు కూటమి నాయకుల దృష్టికి వచ్చిన కుమ్మక్కైన వైనం . తిరుపతి బాలాజీ కాలనీ చంద్రగిరి ఓల్డ్ హైవే రోడ్డుకు, అగ్రికల్చర్ కాలేజీకి గోడకు ఆను కుని ఉన్న, ప్రభుత్వ స్థలాన్ని పేరూరు సర్పంచ్ దర్జాగా ఆక్రమించి, చికెన్ అంగడి, టిఫిన్ సెంటర్, పూల అంగడి, ప్రస్తుతం అగ్రికల్చరల్ కళాశాల బస్టాండ్ కూడా ఆక్రమించుకుని ఇలా దాదాపుగా పది షాపులు పైనే అక్రమంగా నిర్మించి,బాడుగులకు ఇవ్వడం తో దాదాపుగా లక్ష రూపాయలు పైనే నెలకు బాడుగ వసూలు అవుతున్నాయి. గతంలో విద్యానగర్ నుండి చెర్లోపల్లి వరకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి పాదాచారులు, విద్యార్థులు నడవడానికి కూడా లేకుండా ఆక్రమణ జరిగిందని రిపోర్ట్ ఇవ్వడం జరిగిందని స్థానిక ప్రజలు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసిన

మిగతా 2లో..

గత వైసీపీ ప్రభుత్వంలో కసిం గడ్డ ఆక్రమణ
స్థానికులు రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు..

హైవే స్థలం ఆక్రమించుకో.. బాడుగలకు ఇచ్చుకో..
పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు కట్టుకో.. పైసలు పుచ్చుకో..




# పేరూరు సర్పంచా.. మజాకా

## వాగులో తెలుగు తమ్ముడి పాగా



అటు స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి పరిసర ప్రాంతాల్లో చెరువులను వాగులను అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తుంటే అదే పార్టీకి చెందిన ఈ చోటా నాయకుడు ఇలా చెరువులు, వాగులను కబ్జా చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ నాయకుడి తీరుతో సొంత పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు. ఇకనైనా మండల రెవిన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ అక్రమ కట్టడాలకు సంబంధించి రేణిగుంట తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని చరవాణిలో వివరణ కోరగా స్పందించలేదు.

## పేరూరు సర్పంచా.. మజాకా...



అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా పేరూరు పంచాయతీ పరిధిలోని కసిం గడ్డ ప్రభుత్వ స్థలంలో దాదాపుగా వంద అంకణాలు వైసీపీ ప్రభుత్వం లో ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టినట్టు సమాచారం. ఇకపోతే పంచాయతీ పరిధిలో పంచాయితీ సిబ్బందితో కుమ్మక్కై ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటి ఇతర నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి భారీగా వసూలు చేసినట్లు సమాచారం. అలాగే పంచాయతీ పరిధిలోని హరిపురం కాలనీ వద్ద ప్రభుత్వ కాలువ 60 అడుగులు ఉండగా దానిని పూడ్చివేసి కేవలం ఐదు అడుగులు మాత్రమే కాలువ నిర్మించి అనవసరంగా పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసి అంతేకాకుండా ఆ స్థలంలో వైసిపి నాయకులు ఆక్రమణ నిర్మాణాలు చేపట్టారని స్థానిక ప్రజలు వాదన .గతంలో తుడా నిధులు కింద పేరూరు పంచాయతీ పరిధిలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టే సమయంలో సర్పంచ్, పంచాయితీ సిబ్బంది కలసి ఒక్కో ఇంటి నుండి ఐదు వేల రూపాయలు నుండి 20వేల రూపాయల వరకు స్థానిక ప్రజల నుండి వసూలు చేసినట్లు సమాచారం. దీనిపైన అధికారులు స్పందించి వెంటనే పేరూరు పంచాయతీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# న్యాయ కళాశాలలపై విచారణ చేపట్టాలి..



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్** జిల్లావ్యాప్తంగా బార్ కౌన్సిల్ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న న్యాయ కళాశాలలపై జ్యూడిషల్ విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కే శివారెడ్డి డిమాండ్ చేశారు. ఎస్వియూకు అనుబంధంగా నడుస్తున్న జిల్లాలోని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ ఇన్చార్జి చిన్నతో కలసి విసి నర్సింగారావు, రిజిస్టర్ భూపతి నాయుడుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీకి అనుబంధంగా నిర్వహిస్తున్న న్యాయ కళాశాలలు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు ప్రకారం సిబ్బంది లేకపోవడం దారుణమన్నారు. కళాశాలలో కనీసం 45 నుంచి 47 మంది బోధన సిబ్బంది ఉండాలని, 30 తరగతి గదులు, రెండు మూడు ఎకరాల విస్తరణలో స్థాపించి లక్ష సదరపు అడుగుల విస్తరణలో కళాశాల భవనం ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయ కళాశాలలో ఎటువంటి నిబంధనలను పాటించడం లేదని వాపోయారు. న్యాయ కళాశాలలు బోర్డ్ ఆఫ్ కౌన్సిల్ ఇండియా ఇచ్చిన నిబంధనలు తుంగలో తొక్కి వారి ఇష్టం వచ్చినట్లు కళాశాలలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఎస్వీ యూనివర్సిటీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ కళాశాలలో ఇచ్చే ముడుపులకు లొంగిపోయారని వాపోయారు. దీనిపై స్పందించిన విసి రిజిస్టర్ త్వరలోనే న్యాయ కళాశాలలపై విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. విచారణ చేపట్టలేని పక్షంలో ఎస్వీయూ పరిపాలన భవనంను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇందులో ఏఐఎస్ఎఫ్ వెంకటేష్, రవి, శ్రీనివాసులు ఉన్నారు.

## ఉచిత మెడికల్ హెల్త్ చెకప్ క్యాంప్ సద్వినియోగం చేసుకోండి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రం ఆధ్వర్యంలో 8వ జన్ ఔషధీ దివాస్ 2026 కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 వ తేదీ గురువారం ఉచిత మెడికల్ హెల్త్ చెక్-హప్ క్యాంప్ కార్యక్రమం శ్రీకాళహస్తి పట్టణం ముత్యాలమ్మ గుడి వీధి, ఏడు గంగమ్మ గుడి పక్కన ఉన్న ప్రధానమంత్రి జెన్ ఔషద కేంద్రంలో ఏర్పాటు చేశారు. డాక్టర్ కే.వెంకట భాస్కర్, ఎంబిబిఎస్ ఎండి, జనరల్ సర్జన్ అండ్ సీనియర్ మెడికల్ ఆఫీసర్, బి.డబ్ల్యూ.డబ్ల్యూ. ఎఫ్ హరికృష్ణ, స్టేట్ కోఆర్డినేటర్, ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రం వారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ముఖ్య అతిథులు రాష్ట్ర, జిల్లా, పట్టణ అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొంటారు. ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రం, ఏడు గంగమ్మ గుడి పక్కన , ఎంజి స్ట్రీట్, శ్రీకాళహస్తి మెడికల్ క్యాంప్ లో ఉచితముగా బ్లడ్ చెకప్ , బిపి చెకప్, వెయిటేజ్ డాక్టర్ సలహాలు, సూచనలు అందిస్తారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రజలు ఉచిత మెడికల్ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఇంటి పన్ను చెల్లింపులపై అవగాహన



**పెద్దపంజాణి,మేజర్ న్యూస్:** ఇంటి పన్నుపై మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు బసవరాజుకండ్రిగలో ఎంపీడీవో బాలాజీ బుధవారంఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించాలని, గతంలో నగదు తీసుకొని రసీదు ఇచ్చే వారని అయితే ప్రభుత్వం కొత్తగా ఆన్లైన్ విధానం ద్వారా ఇంటి పన్ను చెల్లించే సదుపాయాన్ని కల్పించిందని సూచించారు. లబ్ధిదారులు కూడా సచివాలయ అధికారుల వద్ద తమ ఇంటి పన్ను ఆన్లైన్ విధానంలో చెల్లించి రసీదు కూడా ఆన్లైన్లోనే పొందవచ్చు అన్నారు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, సచివాలయ సిబ్బంది నాగార్జున, జ్యోతి స్వరూప్ పాల్గొన్నారు.

# తూము పూడ్చివేత దుర్మార్గపు చర్య



**పెళ్లకూరు మేజర్ న్యూస్ :** చెరువులో నుండి వస్తున్న సాగునీటి తూము పూడ్చడం దుర్మార్గపు మైన చర్య అని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి అన్నారు.మండలంలోని చిల్లకూరు చెరువు నుండి రైతులు వాడుకుంటున్న సాగు నీటిని జేసీబీ యంత్రాలతో బందించే దాన్ని వైసీపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.ఆయకట్టు కింద సెంటు భూమి కూడ లేని కూటమి నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని రైతుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. రానున్న ఖరీఫ్ సీజన్ లో రైతులు దుక్కికి ముందు పొలాల్లో నీరు వదిలితే భూమి సత్తువ వస్తుందన్నారు.ఈ దుర్మార్గ ఘటన పై హై కోర్టు లో పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు.అయన వెంట సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి ఉన్నారు.



# యువత అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి..

**- 522 మందికి ఉద్యోగ నియామక పత్రాలు - మెగా జాబ్ మేళాలో సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతిసిటీ, మేజర్‌న్యూస్:** నేటి సమాజంలో యువత అవకాలను అందిపుచ్చుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని అనెక్స్ బిల్డింగ్ లో ఎపిఎస్ ఎస్ఎస్ డిసి సౌజన్యంతో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా ప్రారంభ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఎపిఎస్పిడిసిఎల్ లో పొరుగు సేవల కింద ఉద్యోగాల కోసం అభ్యర్థులు ప్రజా ప్రతినిధులు, అధికారుల ద్వారా ఒత్తిడి తీసుకు వస్తున్నారని తెలిపారు. ఈ ఒత్తిడిని అధిగమించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్ డిసి) సహకారంతో జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు.ఈ జాబ్ మేళాకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 1,577 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలియజేశారు. ఆయా కంపెనీల అవసరాల మేరకు అభ్యర్థుల ను ఉద్యోగాల్లోకి ఎంపిక చేసుకుంటాయని తెలిపారు. అభ్యర్థులు నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా కంపెనీల అవసరాల మేరకు ఆత్మవిశ్వాసంతో పనిచేస్తూ ముందడుగు వేయాలని, కంపెనీ తమను వదులుకోలేని విధంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తద్వారా యువత తమకాళ్ళపై తాము నిలబడడమే కాకుండా కుటుంబానికి ఆసరాగా వుండే అవకాశం లభిస్తుందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ నేడు ప్రైవేటు సంస్థల్లో కూడా మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలో 55 దేశాలకు చెందిన సుమారు 500కు పైగా కంపెనీలు నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పోల్చి చూసినట్లయితే ప్రైవేటు సంస్థల్లోనే ఉద్యోగుల వృద్ధి బాగుంటుందని తెలిపారు. యువతకు ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన ఎపిఎస్పిడిసిఎల్ కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వివిధ ప్రైవేటు కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు తమ తమ కంపెనీల గురించి, ఉద్యోగావకాశాల గురించి యువతకు వివరించారు.

**522 మందికి నియామక పత్రాల అందజేత..**

ఈ జాబ్ మేళా ద్వారా వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదుగా బుధవారం సాయంత్రం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సీఎండి వారిని అభినందించారు. జాబ్ మేళాకు విచ్చేసిన తోషిబా, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, అమరరాజా గ్రూప్, డిక్సన్ టెక్నాలజీస్, డైకిన్, డాక్టర్ రెడ్డీస్, మేఘా ఇంజనీరింగ్, హీరో మోటాకార్ప్స్, షిరిడిసాయి ఎలక్ట్రికల్స్, బ్లూస్టార్ ఇండస్ట్రీస్, వీల్స్ ఇండియా తదితర 41 ప్రైవేటు సంస్థల హెచ్ఆర్ ప్రతినిధులు ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, 522 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు, మరో 274 మంది వివిధ కంపెనీల్లో షార్ట్ లిస్ట్ అయ్యారు. షార్ట్ లిస్ట్ అయిన వారికి ఆయా కంపెనీలు మరోమారు ఫైనల్ లెవెల్ ఇంటర్వ్యూలను నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన వారు ఎపిఎస్పిడిసిఎల్, ఎపిఎస్ఎస్ డిసిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్లు పి. అయూబ్ ఖాన్,కె.గురవయ్య,కె. రామమోహన్ రావు,చీఫ్ జనరల్ మేనేజర్లు సిహెచ్ రామచంద్ర రావు,కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి,ఆర్.పద్మ,యం.మురళీ కుమార్, యం.ఉమాపతి, యం. కృష్ణారెడ్డి, కె.సంపత్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, జనరల్ మేనేజర్లు సి. ప్రసాద్, వై.వెంకటరాజు, ఎస్. శ్రీనివాసులు, జి. చక్రపాణి, పి. రవికుమార్, ఎపిఎస్ఎస్ డిసి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాధం, నియామక అధికారి ఎ. గణేష్, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

## జాతీయస్థాయి క్రీడల్లో రాణించిన వెదురుకుప్పం విద్యార్థి



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** జాతీయస్థాయి గోవాలో జరిగిన జాతీయస్థాయి క్రీడల్లో వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి తేజశ్రీ సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు శివశంకరయ్య మాట్లాడుతూ ఈనెల 1,2,3, తేదీల్లో గోవాలో జరిగిన సౌత్ జోన్ సీనియర్ సాఫ్ట్బాల్ జాతీయ స్థాయి క్రీడల్లో పదవ తరగతి విద్యార్థిని తేజశ్రీ సిల్వర్ మెడల్ సాధించి సత్తా చాటిందని అన్నారు. మారుమూల గ్రామం నుండి జాతీయస్థాయిలో మెడల్ సాధించడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. మెడల్ సాధించిన తేజస్వికి క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. జాతీయ స్థాయిలో మెడల్ సాధించడానికి తేజశ్రీ విద్యార్థికి మంచి తర్ఫీదు ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

## 10న సుగుటూరు గంగమ్మ జాతర



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 10 ,11 వ తేదీల్లో పట్టణంలో సుగు టూరు గంగమ్మ జాతర జరుగుతుందని, ఈ జాతరకు కర్ణాటక, తమిళనాడు నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీలోని అన్ని శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జమిందార్ మల్లికార్జున్ రాయల్, ఏపీఎస్ పిడిసిఎల్ ఏడి శ్రీనివాసులు, ఆర్ ఐ ఫణీంద్ర ఫైర్ ఆఫీసర్ సుబ్బ రాజు అన్ని శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళల సాధికారత కోసం అన్ని విభాగాల సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టాలి

**– జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి వెంకటేశ్వరి**

**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్:** మహిళల సాధికారత కోసం అన్ని లైన్ విభాగాల సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కొంగారెడ్డిపల్లిలోని ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధికారిణి వెంకటేశ్వరి ఆధ్వర్యంలో మిషన్ శక్తి – సంకల్ప హబ్ 20 రోజుల కార్యక్రమం అండ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్ల అమలులో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్ జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ గుణ శేఖర్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళా సాధికారిత అవకాశాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పెన్షన్ ఇన్సూరెన్స్ పతకాల అమలు ఉపయోగాలు లాంటి విషయాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వన్ స్టాప్ అడ్మిన్ చందు రాణి, సిబ్బంది సీడీపీఓ శ్యాం సుగుణ సూపర్ వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక సంఘంలో జనగణనపై సిబ్బందికి శిక్షణ

**గూడూరు, మేజర్‌న్యూస్:** జనగణన-2027 లో భాగముగా సన్నాహక శిక్షణా సమావేశాన్ని గూడూరు పురపాలక సంఘ కార్యాలయము నిర్వహించారు. బుధవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గూడూరు పురపాలక సంఘ సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్ మరియు కమిషనర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మున్సిపల్ పరిధిలోని కార్యాలయ సిబ్బందికి మరియు సచివాలయ సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగినది. జనాభా గణన యొక్క ప్రాథమిక అంశాలు, జనాభా గణనకు ముందు మరియు తర్వాత కార్యాచరణ ప్రోటోకాల్‌లు మరియు యాప్ గోప్యతా పరిగణనలకు సంబంధించి అన్ని సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగినది.





## కేవీ నాయుడుకు పరామర్శ

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన చిల్లకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ కెవి నాయుడు ను పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య యాదవ్ బుధవారం ఆయనను కలిసి పరామర్శించారు. కె.వి నాయుడు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చెన్నైలో వైద్యం తీసుకుని మంగళవారం నాడు ఆయన స్వగృహానికి చేరుకోగా విషయం తెలుసు కున్న మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య యాదవ్ ఆయన దగ్గరికి వెళ్లి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. కె.విని పరామర్శించిన వారిలో తెదేపా నాయకులు కోటా రమేష్ తదితరులు ఉన్నారు.

## నూతన వధువును ఆశీర్వదించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

**రొంపిచెర్ల మేజర్ న్యూస్:** నూతన వధువును మాజీ మంత్రి, పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆశీర్వదించారు. బుధవారం బొమ్మయ్యగారి పల్లి గ్రామ పంచాయతీలోని ఫజులుపేట లోని ఎం.కుమార్ బాబు స్వగృహం వద్ద ఎం.కుమార్ బాబు, ఎం.విజయల కుమార్తె ఎం.సుష్మను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కరీముల్లా, వైఎస్సార్సీపీ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, కోటా వెంకటరమణ, రామనారాయణ రెడ్డి, శ్రీనాథ నాయుడు, మహబూబ్ బాషా, ప్రకాష్ రెడ్డి, మంజూర్, ప్రశాంత్ రెడ్డి, బావాజీ సాహెబ్, ఓబులేష్, సైఫుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

**– గుడిపాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎంపీపీ గోళ్ళ**



**గుడిపాల, మేజర్‌న్యూస్:** గుడిపాల మండల ఎంపీపీగా ఒక నెల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీపీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, గుడిపాల మండల అభివృద్ధికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీగా ఎన్నికైన రోజు నుంచి ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని, వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, కాలువలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గారు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. మండల అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామం పురోగతి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్ముందు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చేయిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. గుడిపాల మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం కావాలని కోరారు.

## మహిళలకు చీరలు పంపిణీ

**గూడూరు, మేజర్‌న్యూస్:** ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్‌చే పేద ముస్లీం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బుధవారం ఉదయం షాదీమాంజిల్లో మొహమ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ పదిహేడేళ్లుగా పేద ప్రజలకు సేవ చేయడంపై అభినందించారు. ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థపాక అధ్యక్షులు ఎండీ మగ్దూమ్ మొహిద్దీన్ మాట్లాడుతూ పదిహేడేళ్లుగా పేద ప్రజలు కూడా రంజాన్ పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పట్టణంలో ఎంతో మంది అన్నదానం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు ఎల్వీ. సుబ్బయ్య, మైనారిటీ నాయకులు షేక్ కాలేషా, షబ్బీర్, మగ్ధూమ్ సతీమణితోపాటు ఇద్దరు కుమారుల కష్టం కూడా దాగి ఉందన్నారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జమాలుల్లా, సుధీర్, షేక్ షబ్బీర్, యస్దాని, జహీర్, బాబు, అర్షద్, సయ్యద్ అల్తాఫ్, ఇబ్రహీం, గయాజ్, కరిముల్లా మస్తాన్ సాహెబ్, అబ్దుల్లా, ఆసిఫ్ సందాని, మస్తాన్ భాష తదితరులు పాల్గొన్నారు.



## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**సూళ్లూరుపేట, మేజర్‌న్యూస్:** సూళ్లూరుపేట పురపాలక సంఘంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో రోడ్డుకి ఇరు వైపులా అనుమతులు లేకుండా వాహనాలను పార్క్ చేయడం వలన వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిభందనలు ఉల్లంగించి రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ పెడితే పోలీసులు లాక్ విధిస్తామని సూళ్లూరుపేట ఎస్సై అజయ్ కుమార్, హెచ్చరించారు. ఈ సమస్యలను ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ వాహనాలను అనుమతించిన ప్రదేశాలలో మాత్రమే నిలుపుకోవాలన్నారు.

**గూడూరు పురపాలకసంఘము**

**బహిరంగ వేలము ప్రకటన**

**ఆర్.ఓ.సి.నెం. 813/2022/A1** **తేది: 04-03-2026**

గూడూరు పురపాలక సంఘమునకు సంబంధించిన కూరగాయల మార్కెట్, మటన్, చికెన్ దుకాణములు మరియు రోడ్డు మార్జిన్ షాపులు, చేపలు / రొయ్యల మార్కెటు నందు గల దుకాణముల వారి వద్ద నుండి దినసరి రుసుము/కిస్తీలను ఆర్థిక సంవత్సరము 2026-27గాను తేది 01.04.2026 నుండి 31.03.2027 వరకు వసూలు చేసుకొన్న లీజు హక్కులకు తేది 23.02.2026న జరగవలసిన వేలము పాటకు పాటదారులు ఎవరు హాజరు కానందున వాయిదా వేయటం జరిగినది. అందు పై 2026-27 ఆర్థిక సంవత్సరమునకు గాను తేది 01.04.2026 నుండి 31.03.2027 వరకు లీజు హక్కులకై తేది 12.03.2026 ఉదయము గం.11.00 లకు గూడూరు పురపాలక సంఘ కార్యాలయములో కమీషనరు గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని ఈ క్రింద చూపబడిన మార్కెట్లకు దినసరి రుసుములు వసూలు చేసుకొనుటకు బహిరంగ వేలము నిర్వహించబడునని తెలియజేయడమైనది.

| క్రమ సంఖ్య | మార్కెట్ పేరు | ధరావత్తు | సాల్వెన్సీ సర్టిఫికేటు |
|---|---|---|---|
| 1. | పురపాలక సంఘ కూరగాయల మార్కెట్ నందు మరియు వనజా కృష్ణ కళ్యాణ మండపం నుండి మైథిలి హాస్పిటల్ మధ్య రోడ్డు పై కూరగాయలు అమ్ము అంగళ్ళ వారి వద్ద నుండి దినసరి రుసుము వసూలు చేసుకొనవలను (కూరగాయలు, ఆకు కూరలు, తదితర దుకాణములు) చికెన్/మటన్ దుకాణములు యందు దినసరి కిస్తీ వసూలు చేసుకొను హక్కు, రోడ్ మర్జిన్ నందు గల అన్ని రకముల దుకాణములు వారి వద్ద నుండి దినసరి రుసుములు వసూలు చేసుకొను హక్కు | రూ. 3,00,000/- | రూ. 10,00,000/- |
| 2 | చేపలు మరియు రొయ్యలు తదితరములు మార్కెట్టు మరియు పట్టణ పరిధిలో చేపలు మరియు రొయ్యలు అమ్ముకొను వారి నుండి దినసరి కిస్తి వసూలు చేసుకొను హక్కు. | రూ. 50,000/- | రూ. 3,00,000/- |

వేలము పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా పై తెలిపిన విధముగా ధరావత్తు సొమ్ము, సాల్వెన్సీ సర్టిఫికెట్ లను పురపాలక సంఘ కార్యాలయము నందు దాఖలు పరచవలెను. స్థిరాస్తి విషయంలో రెవిన్యూశాఖలోని డిప్యూటి తహసిల్దారు హోదాకు తక్కువ కానీ అధికారి, మునిసిపల్ పరిధిలోని ఆస్థి విషయములో కమీషనరు వారు జారీ చేసిన సర్టిఫికెట్ అయి ఉండవలెను. తేది: 12.03.2026 ఉదయం 10.30 గం॥ల లోపు సాల్వెన్సీ సర్టిఫికెట్టు ఎ1 గుమస్తాకు అందజేయవలెను సమయము దాటిన తరువాత స్వీకరించబడవు.

ఎటువంటి కారణములు తెలుపకనే వేలము పాట తేదిలను మార్పు/రద్దు చేయుటకు ఎగ్జిక్యూటివ్ అధారిటీ వారికి అధికారము గలదు. మిగిలిన నియమ నిబంధనల కొరకు ఎ1 గుమస్తా గారిని కార్యాలయ పనివేళల యందు సంప్రదించవచ్చును.

**కమీషనరు/-**

**గూడూరు పురపాలక సంఘము**

# ఎవరికోసం... ఇంత అత్యుత్సాహం

**అవసరం లేని చోట చెక్ డ్యాం**

**కాంట్రాక్టర్ లబ్ధి కోసమే నిధులు మంజూరు**

**ప్రభుత్వం నిధులు వృథా**

**మామూళ్లతో సద్దుమణిగిన ఇరిగేషన్ శాఖ**

**కూటమి ప్రభుత్వంవిజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్**

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** భూగర్భ జలాలను పెంచడానికి, రైతుల వ్యవసాయపు బావుల్లో నీరు ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు చెక్ డ్యాంలను నిర్మించడానికి నిధులు మంజూరు చేసేవి. చెక్ డ్యాంలను చిన్నవాగులు, కాలువలు లేదా గల్లీల గుండా ప్రవహించే నీటి వేగాన్ని తగ్గించడానికి, మట్టి కోతకు గురి కాకుండా నివారించడానికి ఉపయోగపడేవి. చెక్ డ్యాంలలో నీరుంటే పంట పొలాలకు వాడుకోవచ్చునన్న భావనతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు నిధులు మంజూరు చేసి నిర్మించి ఇచ్చేవి. ఇవి సాధారణంగా రాళ్లు, కాంక్రీట్‌తో నిర్మించబడతాయి. ఇవి నీటిని నిల్వ ఉంచడం, ఉపరితల ప్రవాహాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణను, వ్యవసాయానికి ఉపయోగకారిగా ఉంటూ రైతన్నలకు దన్నుగా ఉండేవి. ఇటువంటి సంకల్పాన్ని ధనాపేక్షతో కాంట్రాక్టర్లు అవసరమైన చోట నిర్మించకుండా, నిరుపయోగమైన స్థలాల్లో నామమాత్రంగా నిర్మించి బిల్లులు చేజిక్కించుకుని చేతులు దులిపేసుకుంటున్నారు. ఇటువంటి సంఘటనే వెదురుకుప్పం మండలం దిగుపల్లాలు పంచాయతీలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గత ఆరు సంవత్సరాల క్రితం దిగు పల్లాలు పంచాయితీ ఎస్టి కాలనీ సమీపంలో ఓ చెక్ డ్యాంకు



సుమారు రూ.10లక్షలు నుంచి రూ.15 లక్షల నిధులను మంజూరు చేశారు. చెక్‌డ్యాం నిర్మాణానికి ముందు అధికారులు రైతులకు ఉపయోగపడే విధంగా, అనుకూలమైన ప్రదేశంలో నిర్మించకుండా, ఎవరికి ఉపయోగంలోని ప్రాంతంలో నిర్మించడానికి లైన్ ఎస్టిమేషన్లు పంపించి పనులను మంజూరు చేయించుకున్నారు. చెక్‌డ్యాంనిర్మాణానికి కాంట్రాక్టర్ అధికారులను తమ వైపు మళ్ళించుకుని అతని ఇష్టారాజ్యంగా నిర్మాణ పనులను చేపట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్‌కు గత అధికార పార్టీ అండదండలు ఉండడంతో తూతూ మంత్రంగా చెక్ డ్యాం నిర్మించి బిల్లులు చేపించుకొని, ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినట్లు పలువురు విమర్శిస్తున్నారు. చెక్‌డ్యాం నిర్మాణం ఎవరికి ఉపయోగం లేదని, రైతులకు ఉపయోగపడే విధంగా నిర్మాణ పనులను చేపట్టి ఉంటే రైతులకు కాస్తయినా మేలు జరిగేదని పలువురు అంటున్నారు. అధికారులు చెక్‌డ్యాం నిర్మాణానికి అనుమతులు ఎలాఇచ్చారో ఉన్నత స్థాయి అధికారులచే దర్యాప్తు జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి నాసిరకమైన, అవసరంలేని చోట నిర్మించిన చెక్ డ్యాంలను సర్వేలు చేపించి, అప్పటి కాంట్రాక్టర్లను గుర్తించి నిధులను రికవరీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 8 నుంచి టెన్నిస్ బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మాస్టర్స్ పురుషులు, మహిళాల టెన్నిస్, బ్యాట్మెంటన్ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు చేపడుతున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జిల్లాస్థాయి టోర్నమెంట్, ఎంపిక పోటీలు బ్యాట్మెంటన్, టెన్నిస్ విభాగాలకు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా బ్యాట్మెంటన్ పోటీలకు పాల్గొనే అభ్యర్థులు 35 ఏళ్లు దాటిన పురుషులు సింగల్స్, డబుల్స్, సింగిల్స్ మహిళలు మిక్సిడ్ డబుల్స్ జట్టులో పాల్గొనవచ్చు అన్నారు. 45 ఏళ్లు దాటిన పురుషులకు సింగిల్స్, డబుల్స్ విభాగాలలో పాల్గొనవచ్చు. ఈ పోటీలలో రాణించిన అభ్యర్థులు ఈనెల 14, 15 తేదీలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో టెన్నిస్‌కు, ఈనెల 22 23వ తేదీలలో విజయనగరంలో జరగబోయే రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు టెన్నిస్ కు డివిస్డిఓ శశిధర్ 9948444759, బ్యాడ్మింటన్‌కు ఎం.నాగరాజు 93935 30638, ఈ గోపిలను సంప్రదించాలన్నారు. ఈ పోటీలలో పాల్గొన దలచిన వారు సాప్ క్రీడా వెబ్సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

# వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్- 2026 రాష్ట్రస్థాయికి ఎంపికైన పివికేఎన్ విద్యార్థి

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగరంలోని అపోలో విశ్వవిద్యాలయం నందు మంగళవారం జిల్లా స్థాయిలో జరిగిన ఎలక్ట్రిషన్ పోటీల్లో 50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ లెస్సన్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ అనే అంశంపై వివిధ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో పివికేయన్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో బిఎ పొలిటికల్ సైన్స్ చదువుతున్న చదువుకున్న విద్యార్థి టాప్ 10లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జీవన్ జ్యోతి మాట్లాడుతూ నేటి యువత చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని అక్షయకుమార్‌ని అభినందించారు. అలాగే కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర ఎన్ఎస్ఎస్



ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.రాజేష్ కుమార్, డాక్టర్ ఎన్.రామ్మూర్తి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

# ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

**పలమనేరు, మేజర్‌న్యూస్:** రోడ్డు ప్రమాదంలో ఐదు మంది కర్ణాటక రాష్ట్రం చెందినవారు మృతి చెందడం జరిగింది. గంగవరం సీఐ రాంభూపాల్ కథనం మేరకు వివరాలు ఇలా కర్ణాటక రాష్ట్రానికి ఒకే కుటుంబానికి చెందిన ఐదు మంది నాగరాజు రావు (60) జయంతి(48) కుసుమ(35) మోహన్ దాస్(53) పూజ(18)వీరందరూ కారులో బెంగళూరు నుండి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళుతుండగా పలమనేరు సమీపంలోని వైయస్సార్ సర్కిల్ వద్ద చిత్తూరు వైపు వెళుతున్న లారీ వెనుక వైపు వస్తున్న కారు ఢీకొనడంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఐదు మంది అక్కడకక్కడే మృతి చెందినారు. విషయం తెలుసుకున్న వెంటనే గంగవరం సీఐ రాంభూపాల్ సహాయక చర్యలు చేపట్టారు. ఈ విషయం రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిత్తూరు






ఎంపీ దుగ్గిమల్ల ప్రసాదరావు కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు రోడ్డుపై ఉన్న లారీని కారును ప్రక్కకు తీసివేశారు. కారులో ఇరుక్కుపోయిన శవాలను అతి కష్టం మీద వెలికి తీశారు. మృతదేహాలను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శవాలను వారి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# చంద్రగిరిలో రహదారులు అభివృద్ధికి నిధులు మంజూరు

**ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి రూ.10కోట్లు**

**ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో రహదారులకు మహర్దశ.. మేకల తిరుమల రెడ్డి**

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:**

చంద్రగిరి నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం భారీగా నిధుల మంజూరు చేసింది. నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా (పాతికేళ్లగా) అభివృద్ధికి నోచుకోక గుంతల మయమైన ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామాల పర్యటన సందర్భంగా గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి ఎనిమిది ఆర్ అండ్ బి రహదారులకు సుమారు రూ.10కోట్ల మంజూరు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో చంద్రగిరి నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బి రహదారులకు నూతన శోభ సంతరించుకోబోతున్నది. రహదారులఅభివృద్ధితోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి, రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయని మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్రంలోని రహదారుల ఆధునీకరణ, అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నారని ఆయన తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని కృషితో సుమారు 10కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రహదారులకు మహర్దశ కలిగిందన్నారు. రహదారులే కాకుండా ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిని పరుగులెత్తిస్తున్నట్లు



ఆయన తెలిపారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి-తిరుచానూరు రహదారి నుండి చల్లవారిపల్లి (తనపల్లి వెంకటరామపురం మార్గంగా) కి.మీ. 0/292 నుండి 0/417 వరకు అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు. పుదిపట్ల- రంగంపేట వద్ద కి.మీ. 28/40 నుండి 28/60 మరియు 31/40 నుండి 31/70 వరకు రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులకు రూ.80లక్షలు. ఎన్‌హెచ్ 205 కి.మీ. 1/8 నుండి 4/8 వరకు రైల్వేఫీడర్ రోడ్ (రెడ్డివారిపల్లి, నాగయ్యగారి పల్లి మార్గంగా) అభివృద్ధి పనులు, చంద్రగిరి రైల్వే ఫీడర్ రోడ్ కి.మీ. 3/530 నుండి 410 వరకు అభివృద్ధి పనులకు రూ.40లక్షలు. చంద్రగిరి నుండి అనుపల్లి రహదారి (బొప్పరాజుపల్లి, గంగుడు పల్లి మార్గంగా) కి.మీ. 1/8 నుండి 1/10 వరకు రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులకు రూ 33.00 లక్షలు. డి.పి రోడ్ నుండి డి.ఎన్ రోడ్ వరకు (వయా కృష్ణాపురం) కిమీ 8/2-4 మధ్య రహదారి రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులకు రూ.20 లక్షలు. మొండి కల్వ అప్రోచ్ రోడ్లు కిమీ 0/6 నుండి 2/7 వరకు రహదారి మెరుగుదల పనులు- రూ.40.00 లక్షలు. నరసిగాపురం లింక్ రోడ్ (సిటిఎండి-032)లో కిమీ 0/0 నుండి 1/6 వరకు రహదారి రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులు. (ఆ) నరసిగాపురం గ్రామ రోడ్ (సిటిఎండి-031)లో కిమీ 0/0 నుండి 11842 వరకు రహదారి రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులకు రూ.250.00 లక్షలు. తోండవాడ - రామాపురం రోడ్లో కిమీ 5/0 నుండి 7/0, 8/5 నుండి 10/3 వరకు రహదారి రైడింగ్ మెరుగుదల పనులకు రూ.250 లక్షలు ప్రభు త్వం మంజూరు చేసినట్లు ఆర్ అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజానాయక్ తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి ఈ పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వ పాలకులకు ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)కి నియోజకవర్గ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



# సహజ వ్యవసాయ కొనుగోలు, అమ్మకందారుల నెట్‌వర్కింగ్ సమావేశం

**ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారం, రైతు ఆదాయం రెండింటి పెరుగుదల సాధ్యం**

**సహజ పద్ధతుల విస్తరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి**

**జిల్లా కలెక్టర్. డా ఎస్.వెంకటేశ్వర్**




**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో సహజవ్యవసాయ ఉత్పత్తులకు రాష్ట్ర స్థాయిలో బలమైన మార్కెట్ వేదికను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కొనుగోలు-అమ్మకందారుల నెట్‌వర్కింగ్ సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల భూమి సారం తగ్గిపోవడం, ప్రజల్లోఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం అవసరం మరింతగా పెరిగిందని అధికారులు పేర్కొన్నారు. సహజ వ్యవసాయం అనుసరించడం ద్వారా భూమిసారాన్ని కాపాడుకోవడంతో పాటు దిగుబడులు స్థిరంగా ఉంటాయని వివరించారు. యూరియా, రసాయన ఫర్టిలైజర్లు, పెస్టిసైడ్లు వినియోగం తగ్గించడం వల్ల నేలలో జీవ వైవిధ్యం పెరిగి, తేమ నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందని తెలిపారు. రసాయన అవశేషాలులేని ఆహారం ప్రజలకు అందించడం ద్వారా ఆరోగ్య రక్షణ సాధ్యమవుతుందన్నారు. సహజ పద్ధతిలో ఉత్పత్తి చేసిన ధాన్యాలు, పండ్లు, కూరగాయలకు మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సహజ వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ రైతు సాధికారసంస్థ ద్వారా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు పూర్తిగా సహజ వ్యవసాయం వైపు మారేందుకు శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో చేసిన పరిశీలనల్లో ఒకే భూమిలో సగం భాగంలో సహజ వ్యవసాయం, మిగతా భాగంలో సాంప్రదాయ పద్ధతులు పాటించినప్పుడు సహజ పద్ధతిలో సాగు చేసిన పంటలు ఎక్కువ నిలకడగా ఉన్నట్లు గమనించామని తెలిపారు. ముఖ్యంగా తేమ నిల్వ, కీటక నిరోధక శక్తి, భూమి గట్టితనం వంటి అంశాలలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని చెప్పారు. సహజ ఉత్పత్తులకు సరైన ధర లభించేందుకు రైతు-కొనుగోలు దారుల నేర అనుసంధానం అవసరమని పేర్కొన్నారు. మధ్యవర్తులను తగ్గించి ప్రత్యక్ష మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అలాగే సర్టిఫికేషన్ ప్రక్రియను విస్తరించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు, మెరుగైన ధరలు సాధ్యమవుతాయని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో డ్రిప్‌ఇరిగేషన్, తక్కువ నీటితో సాగు, పంటల విభిన్నీకరణ (డైవర్సిఫికేషన్) అవసరమని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో అధికశాతం మామిడి పంట సాగవుతున్న నేపథ్యంలో ఇతర తోటలపంటలు, ఫ్లోరికల్చర్, మిల్లెట్స్ వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని కోరారు. దేశంలోనే పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉన్న నేపథ్యంలో సహజ వ్యవసాయాన్ని విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని మరింత పెంచవచ్చని తెలిపారు. రైతు సాధికార సంస్థ సీఈఓ బి.రామారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం





ద్వారా సహజ వ్యవసాయం రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించి, రైతులు వినియోగదారుల మధ్యబలమైన డిమాండ్-సరఫరావ్యవస్థ ఏర్పడుతుంది. రైతులకు స్థిరమైన మార్కెట్, న్యాయమైన ధర లభించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, రసాయన రహిత ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి. ఇటువంటి నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు సహజ వ్యవసాయాన్ని ఆర్థికపరంగా స్థిరంగా నిలబెట్టేందుకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.ప్రసాదరావు, డిపియం షణ్ముగం ఏఎల్‌జిఆర్‌ఏయు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.వి.సుమతి, డా.వైయస్సార్ హెచ్‌యు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ బి.గోవిందరాజులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, రాష్ట్ర ఆర్‌వైఎస్ ఎస్బృంద సభ్యులు, వివిధ జిల్లాల అధికారులు జశ్వంత్ మిల్లెట్స్, గురునాథ్ మిల్లెట్స్, సర్వలక్ష్మి నేచురల్స్, విశ్వభారతి నేచురల్స్, పలమనేర్ ఫార్మ్స్, సస్టైన్‌ఈట్స్ (నెల్లూరు), ఐటీసీ ప్రతినిధులు, గోసహజ నేచురల్ ఫార్మ్, రైతు నేస్తం జస్ట్ మిల్లెట్స్, ప్రకృతిరేఖ కొనుగోలుదారులు రైతులు పాల్గొన్నారు.

# చెరువు కాదు... ఆక్రమణల కోసమే సర్వే!

**గూడూరు, మేజర్‌న్యూస్:** ముత్యాపాడు చెరువు ఆక్రమణలపై ఆయకట్టు గ్రామాల రైతులు ఆందోళన చెందుతుంటే ఆక్రమణల కోసం సర్వే చేసే ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ముత్యాలపాడు చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఆయకట్టు రైతులు



ఫిర్యాదు చేయగా ఆ దిశగా సర్వే చేయాల్సి ఉండగా రెవెన్యూ సిబ్బందిచెరువులో మట్టి తోలిన భూమి పట్టా భూమిగా పేర్కొంటూ సర్వే చేసేందుకు ప్రయత్నించగా ఇరిగేషన్ అధికారులు తిరస్కరించి చెరువు హద్దులు పూర్తిగా చూపిన తర్వాతనే ఆక్రమణలపై ముందుకు వెళతామని ఎఇ ఫరూక్ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సర్వే గత రికార్డులను వెలికి తీయకుండా రీ-సర్వే సమయంలో అక్రమంగా వ్రాయించుకున్న రికార్డులను చూపుతూ సర్వే చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెల్సింది. గతంలో రెవెన్యూ అధికారులు ఈ సర్వే నంబర్లలో ఎక్కడా పట్టా భూమి లేదని పేర్కొంటూ ఉన్నతాధికారులకు నివేదికలు కూడ ఇచ్చి ఉన్నారు. ఈ రికార్డులు ఏవీ లేకుండానే మళ్లీ ...మళ్లీ ఈ ఆక్రణను సక్రమమే అని చూపే ప్రయత్నాల్లోనే రెవెన్యూ ఉన్నట్లు బిజెపి నాయకులు బైరప్ప ఆరోపిస్తున్నారు. చెరువు పూర్తి ఆయకట్టు (ఎఫ్‌టిఎల్) పరిధి నిర్ధారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముత్యాలపాడు చెరువులోతట్టు నిర్ధారించకుండా చెరువులో పట్టాలు ఉన్నాయంటూ చెప్పడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్‌టిఎల్ నిబంధనల మేరకు పట్టా ఉన్న కేవలం వ్యవసాయం చేసుకోవల్సి ఉంటుందని అయితే చెరువు పూడ్చి వేస్తుండడంతో ఆయకట్టు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

# నేటి నుంచి పది హాల్ టికెట్లు విడుదల

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు నేటి నుంచి వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం www.bse.ap.gov.in అధికారిక వెబ్సైటు, మనమిత్ర సర్వీస్ వాట్సఅప్ నెంబర్ 95523 00009, పాఠశాల విద్యాశాఖ ఎల్‌ఈ ఏపీ ద్వారా హాల్ టికెట్లు పొందొచ్చు అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు పైన పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వ అధికార వెబ్సైట్లో ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని, లేదా సంబంధిత పాఠశాల హెచ్‌ఎంను సంప్రదించవచ్చని సూచించారు. కావున జిల్లాలోని పాఠశాలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని సంబంధిత విద్యార్థులకు తెలియజేసి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునేలా చూడాలని సూచించారు.

# శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం హుండీలు లెక్కింపు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం శ్రీ జ్ఞానప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల హుండీలు లెక్కింపు బుధవారం ఉదయం 7గంటలకు రూ.500 రాహు కేతు మండపం వెనక ఉన్న పాతమండపం మందు కొట్టు మండపంలో ఆలయ కార్య నిర్వహణాధికారి టి.బాపిరెడ్డి,



తిరుపతి జిల్లా దేవాదాయ ఇన్స్పెక్టర్ ఫణింద్ర వార్ల సమక్షంలో నిర్వహించారు. మొత్తం ఆదాయం 2 కోట్ల 50 లక్షల 22 వేల 226 రూపాయలు రావడం జరిగిందని ఈఓ టి బాపిరెడ్డి తెలిపారు. ఇతర దేశాల నోట్లు నూట ఇరవై నాలుగు కాయిన్స్ వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, దేవస్థానం డిప్యూటీ ఈఓ ఎన్ఆర్. కృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు గుర్రపు శెట్టి పాల్గొన్నారు.



# రీ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించండి

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్, రీ సర్వే,సంబంధిత రెవెన్యూ అంశాలపై జిల్లాలోని అందరు ఆర్డీఓలు, తహశీల్దార్లు, సర్వేర్లతో రెవెన్యూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్, డిఆర్ఓ మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడిల్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాల్లో ప్రభుత్వ ఆదేశాల అమలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం, ప్రజాసేవల మెరుగుదల వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూరికార్డుల నమోదు ప్రక్రియను గడువులోగా ముగిం చాలని స్పష్టం చేశారు. సర్వీస్ లెవల్






అగ్రిమెంట్ గడువులు దాటకుండా ప్రతి దరఖాస్తును సమయపాలనతో పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ సేవలపై ప్రజల సానుకూల భావన 80 శాతం పైగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులను నిర్వహించడం అనేది రెవెన్యూ సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే సదుద్దేశ్యంతో చేపట్టడం జరిగిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతగా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భూ హక్కు పత్రం, మ్యూటేషన్, 22ఎ నిషేధిత భూములు, సర్వే నంబర్ సబ్ డివిజన్, తదితర భూసంబంధిత పెండింగ్ అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసుల్లో సకాలంలో స్పందించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలన్నారు. పిజిఆర్ఎస్ ఇప్పటినుంచే కాదు, గత సంవత్సరం నుంచే జరుగుతోంది. పిజిఆర్ఎస్‌లో వచ్చిన వినతులు ఎక్కువ మేరా భూ సమస్యలపై ఉన్నదని తెలిపారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు భూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్లో వచ్చిన వినతులను సంబంధిత ఎమ్మార్వోలు ఎండర్స్మెంట్ చేసి కింద విఆర్ఓకి అందజేస్తారు. సమస్య పరిష్కరించారా లేదా తిరస్కరణకు గురైన కారణాలు తెలుపుతూ నివేదికలు ఉండాలని ఆదేశించారు. సంబంధిత ఎమ్మార్వోలు వీఆర్వోలతో సమీక్ష సమావేశాలు నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. వెబ్‌ల్యాండ్స్‌లో ఉన్న సర్వేనంబర్లు, ఇతర రికార్డులు సరిపోతున్నాయా చూడాలి. గ్రామాల వారీగా వివరాలు పరిశీలించాలి. పిజిఆర్ఎస్ వచ్చిన వినతులపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఆర్ఓఆర్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు, పలమనేరు డివిజన్లో 29, చిత్తూరు డివిజన్లో 174, నగిరి డివిజన్లో 53, కుప్పం డివిజన్లో 20, మొత్తం జిల్లాలో 276 ఆర్ఓఆర్ కేసులు ఉన్నాయని తెలిపారు. వివిధ భూ సమస్యలకు సంబంధించిన కోర్టులు కేసులకు సంబంధించిన ఫైల్స్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలి ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పౌరసేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉన్నదని తెలిపారు. ఈ క్రింది సబ్జెక్టులనురెవెన్యూ క్లినిక్, మ్యుటేషన్ల పిబిఎస్ కరెక్షన్ మాడ్యూల్-లావాదేవీల కోసం మ్యుటేషన్, జీరో ఖాతాలు, పునరుజ్జీవనకుల సుయో-మోటో న్యాయ, క్వార్టర్ల కోసం గుర్తించబడిన భూముల స్థితి, ఎన్‌డిపిఎస్ సురక్షిత నిల్వ ఏఎంఎస్ పెండింగ్, పిజిఆర్ఎస్, డాగ్, ఓఆర్‌సిఎంఎస్, ఆర్ఓఆర్ కేసుల తొలగింపు, నవీకరణ,22ఏ కేసులు కోర్టు కేసులు ఓఎల్‌సిఎంఎస్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, కుప్పం, నగిరి ఆర్డీఓలు శ్రీనివాసులు, విజయలక్ష్మి, అనుపమ, సర్వేర్ డిడి జయరాజు, వివిధ మండలాల ఎమ్మార్వోలు, డిప్యూటీ తాసిల్దార్లు, సర్వేర్లు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 378 మంది గైర్హాజరు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా జరిగిన ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్ పేపర్-2, సివిక్స్ పేపర్-2 పరీక్షకు 378 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ జి.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 84 పరీక్ష కేంద్రాలలో జనరల్ పరీక్షకు 24,104 మంది విద్యార్థులుకు గాను 23,726 మంది విద్యార్థులు రాయగా 378 మంది విద్యార్థులు గైహజరయ్యారని, అలాగే ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు 14 పరీక్ష కేంద్రాలలో 1,095 మంది విద్యార్థులుకు గాను 1,063 మంది విద్యార్థుల హాజరుకాగా 32 గైహజరయ్యారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో ఇంటర్మీడియట్ బోర్డు అనుసంధానంతో పర్యవేక్షించారు. కేంద్రాలలో మెడికల్, త్రాగునీరు, వసతి కల్పించినట్లు పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా అధికారులు పటిష్టంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసామని తెలియజేశారు.

## ఇంటర్ స్కూల్ కాంపిటీషన్‌లో సత్తా చాటిన నారాయణ పాఠశాల విద్యార్థులు



**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం పట్టణంలోని గుడుపల్లి రోడ్డులో ఉన్న నారాయణ పాఠశాలలో నందు విద్యకే కాదు,ఆటల పోటీలలో కూడా అగ్రగామిగా నిలిచింది. ట్రైలర్ స్కూల్ ఫిబ్రవరి 27,28,01 తేదీల్లో జరిగిన కబడ్డీ, కోకో, బ్యాక్ మిటన్ లలో మొదటి బహుమతిని సాధించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ , మురళి తెలియజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను నారాయణ పాఠశాల డీజీఎం కొండలరావు, ఏటీఎం రవీంద్రా ఫణి కుమార్, ఆర్ ఐ ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ , ఆర్ అండ్ డి హెడ్ విగ్నేష్, డీన్ ప్రదీప్, కళాశాల ఏజీఎం బాలకృష్ణ మరియు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**పాకాల, మేజర్ న్యూస్:** మండలంలోని ముద్దలపల్లి గ్రామంలో పొలాలలో రైల్వే ట్రాక్ సమీపంలో సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య గల వయసు ఉండే ఒక మగ వ్యక్తి మరణించి ఉన్నాడు. అతని తలపై బలమైన గాయం అయినది. అతనిని గుర్తు తెలియని వ్యక్తులు ఏదో కారణం తో కట్టే గాని, రాడ్డు తో గాని చంపి వేసి ఉండవచ్చు లేదా ప్రమాద వశాత్తూ క్రింద పడి గాని మరణించి ఉండవచ్చు. ప్రజలకు విజ్ఞప్తి: ఆ వ్యక్తిని గుర్తుపట్టిన యెడల సమాచారం పాకాల పోలీసు లకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాం. సీఐ 9440796717, ఎస్సై 9440796718.

## దాసుకుప్పంలో పోలీసులు "కార్డెన్ సెర్చ్

**- 17 ద్విచక్ర వాహనాలు,రెండు ఆటోలు, ఒక కారు సీజ్**



**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా సత్యవేడు మండలం దాసుకుప్పం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సత్యవేడు పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళినాయుడు ఆధ్వర్యంలో సత్యవేడు,నాగలాపురం ఎస్సైలు సాయినాథ్ చౌదరి,సునీల్ పర్యవేక్షణలో 25 మంది పోలీసు బృందాలు ఏకకాలంలో మూకుమ్మడిగా ఎస్టి కాలనీ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి.ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను ఆరా తీయడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాన్ని జల్లెడ పట్టారు.ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులో తీసుకొని విచారణ చేపట్టారు.దీంతోపాటు రికార్డులు సక్రమంగా లేని 17 ద్విచక్ర వాహనాలను,రెండు ఆటోలు,ఒక కారు సీజ్ చేశారు. అనంతరం గంజాయి వాడకం,సైబర్ నేరాలు, అనుమానితులు సంచారం,లైంగిక వేధింపులు వంటి పలు అంశాలపై సీఐ మురళి నాయుడు స్థానికులకు అవగాహన కల్పించారు.

## అంగన్వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి



**రొంపిచెర్ల మేజర్ న్యూస్ :** అంగన్వాడీ ఉద్యోగాలకు నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పులిచెర్ల ప్రాజెక్టు, రొంపిచెర్ల మండల సూపర్వైజర్ శిరీష తెలిపారు. పులిచెర్ల ప్రాజెక్టు సీడీపీఓ వాణిశ్రీదేవి ఆదేశాల మేరకు రొంపిచెర్ల మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండలంలో 7 అంగన్వాడీ కేంద్రాలకు హెల్పర్ పోస్టు లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. బలిజ వీధి ఓసీ కేటగిరి, రామచంద్రాపురం కాలనీ ఓసీ, కట్టావారి పల్లి ఎస్సీ, గుట్ట కింద హరిజనవాడ ఎస్సీ , పాతపేట ఓసీ, నగిరి హరిజనవాడ ఎస్సీ, మోటు మల్లెల ఓసీ కేటగిరి లను ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10 వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు వివాహితై, స్థానికులై ఉండాలన్నారు. 01-07-2025 నాటికి దరఖాస్తు చేసే అభ్యర్థులు వయస్సు 21 సంవత్సరముల నుండి 35 సంవత్సరాల లోపు ఉన్న వారై ఉండాలన్నారు. రోస్టర్ పద్ధతిలో ఉద్యోగాల కేటాయింపు ఉంటుందన్నారు. దరఖాస్తు చేయి అభ్యర్థులు అప్లికేషన్ ను పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసుకి తీసుకొని వెళ్లి, విద్యార్హత సర్టిఫికెట్ల ను జతపరిచి మార్చి 16 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విందు ఇచ్చిన మంత్రి నారా లోకేష్.. పాల్గొన్న బొజ్జల కుటుంబ సభ్యులు



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి పార్లమెంట్ కూటమి, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో శ్రీకాళహస్తి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. నారా లోకేష్ తో కలిసి వీరు కుటుంబాలు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్‌తో కలిసి పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నారా, బొజ్జల కుటుంబాల మధ్య ఉన్న దశాబ్దాల నాటి అనుబంధం ఈ భేటీతో మరోసారి గుర్తుకు వచ్చింది అన్నారు. ఈ సందర్భంగా మా నాన్న స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మధ్య ఉన్న గాఢమైన స్నేహాన్ని, లోకేష్ అన్నతో నాకున్న చిన్ననాటి అనుబంధాన్ని ఆత్మీయంగా చర్చించుకున్నాము. నాన్న చేసిన అభివృద్ధి పనులను, శ్రీకాళహస్తి నియోజకవర్గంతో ఆయనకు ఉన్న మమేకాన్ని లోకేష్ అన్న ఎంతో గౌరవంగా స్మరించుకోవడం నాకు స్ఫూర్తినిచ్చింది. శ్రీకాళహస్తి జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వర స్వామి ఆశీస్సులు లోకేష్ అన్న కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, స్వామి వారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. మన శ్రీకాళహస్తి నియోజకవర్గ కళా వైభవాన్ని చాటిచెప్పే శ్రీ విష్ణు మత్స్యావతారం ప్రతిమ. ప్రసిద్ధ గుడిమల్లం టెంపుల్ బుక్‌ను లోకేష్ అన్నకు జ్ఞాపికగా బహూకరించడం జరిగింది. ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ కలయిక కేవలం ఒక విందు మాత్రమే కాదు, ఇది కూటమి కుటుంబాలు మధ్య ఉన్న ప్రేమానురాగాలకు ప్రతీక. ప్రజల క్షేమమే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తున్న లోకేష్ అన్న నాయకత్వంలో మన రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు.

## ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

**- క్వాంటమ్ టెక్నాలజీ సాంకేతిక విప్లవానికి పునాది : విసి**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** క్వాంటమ్ టెక్నాలజీ భవిష్యత్ సాంకేతిక విప్లవానికి పునాది వంటివని విసి ప్రొఫెసర్ టాటా నర్సింగరావు పేర్కొన్నారు. ఎస్వీయూలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు



చేసిన మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న క్వాంటమ్ టెక్నాలజీస్ కాన్సెప్ట్స్, ఛాలెంజెస్, ఆపర్చునిటీస్ అనే అంశంపై ఆరు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను బుధవారం విసి ప్రొ.నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెన్సింగ్ వంటి రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయనితెలిపారు. అధ్యాపకులు, పరిశోధకులు ఈ రంగంలో నైపుణ్యాలను పెంచుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డా.బి.హేమలత రుద్రమాదేవిగా, ఎంఎంటిటిసి డైరెక్టర్ ఆర్పి విజయలక్ష్మి మార్గదర్శకులుగా, ఫిజిక్స్ అధ్యాపకులు ఓఎం హుస్సేన్, ప్రత్యేకసలహాదారు ఆచార్య వి. వాసుదేవరావు సహకారం అందిస్తున్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల అధ్యాపకులు ఈ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో నిపుణుల ఉపన్యాసాలు, సాంకేతిక చర్చలు జరుగుతాయి. ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులకు క్వాంటమ్ టెక్నాలజీస్ పై సూచనలు, సవాళ్లు, అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## నాయీ బ్రాహ్మణులకు శ్రీవారి దివ్య దర్శనం

**- 'నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి'**
**- టీటీడీ బోర్డు మెంబర్ వైద్యం శాంతరామ్**



**కుప్పం,మేజర్ న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాధికార సమితి సభ్యులు, కుల సంఘ నాయకులు, అలాగే గత ఐదు సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కోసం కృషి చేసిన యువతకు తిరుమల శ్రీవారి విఐపీ బ్రేక్ దర్శనం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని టీటీడీ బోర్డు మెంబర్ వైద్యం శాంతరామ్ తెలిపారు. తిరుమల వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో మొత్తం 90 మందికి విఐపీ బ్రేక్ దర్శనం సదుపాయం కల్పించబడిందన్నారు. దర్శనానంతరం సభ్యులు శ్రీవారి ఆశీర్వాదాలు పొందుతూ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యం శాంతరామ్ మాట్లాడుతూ తన ప్రాణ సమానమైన నాయి బ్రాహ్మణ సోదరులు, సాధికార సమితి సభ్యులు, సంఘ నాయకులు అందరూ ఒకే వేదిక పై కలుసుకొని శ్రీవారి దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.వారి ఆధ్యాత్మిక కోరిక నెరవేండం నాకు వ్యక్తిగతంగా తృప్తినిచ్చిందని అన్నారు. అంతేకాకుండా, ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన టీటీడీ బోర్డు సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా సమాజ సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవలు మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ దర్శన కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సభ్యులు పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందారు.

## ఉపాధ్యాయుల సమస్యల సాధనకై పోస్ట్ కార్డు ఉద్యమం



**పాకాల, మేజర్ న్యూస్:** పాకాల మండల కేంద్రం నందు జరిగిన సమావేశం లో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘంనాయకులు మాట్లాడుతూ. ఉపాధ్యాయ సమస్యల సాధనకై పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టాలని కోరింది .ఈ కార్యక్రమం లోవారుమాట్లాడుతూ 12వ పి.ఆర్.సి నియామకం చేపట్టాలని .పెండింగ్ డిఏలు అమలుకు కృషి చేయాలని రిటైర్మెంట్స్ బెనిఫిట్స్. ఉపాధ్యాయుల కు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు .ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మనేరి ప్రభు ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి సుధాకర్ మరియు కార్యవర్గ సభ్యులు సీనియర్ సభ్యులు యం.చంద్రశేఖర్ ,పి.రఘు,హరి ,యం.అప్పాజీ సార్లు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లలో లక్ష్యం సాధించాలి-డిపిఓ



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** పన్ను వసూళ్లలో లక్ష్యం సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి సుధా కర్ రావు ఆదేశించారు. బుధవారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిపిఓ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల అభివృద్ధి అధికారులు, ఈవో పి ఆర్ డి లు, పంచాయతీ అభివృద్ధి అధికారులు సమిష్టిగా పనిచేసి పన్ను వసూలు చేయడంలో లక్ష్యాన్ని అధికమించాలని కోరారు.. మూడు రోజుల్లో అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా అధి కారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయానికి పంచలోహ ఉత్సవమూర్తి విగ్రహం సిద్ధం



**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** సత్యవేడు పట్టణము శ్రీకాళహస్తి మార్గంలో భక్తుల పూజలు అందుకుంటున్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధిత నిర్వాహకులు ఉత్సవమూర్తి ఆంజనేయస్వామి విగ్రహాన్ని సిద్ధం చేశారు.ఏప్రిల్ 2వ తేదీన హనుమాన్ జయంతి ఆలయంలో ఘనంగా నిర్వహించడంతో పాటు ఉత్సవ మూర్తిని పట్టణంలో ఊరేగించడానికి ఆలయ నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే పంచలోహాలతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని తెప్పించారు.ఆలయ నిర్వాహకులు,ధర్మకర్త నాగభూషణం సొంత నిధులతో పాటు దాతలు నుంచి కూడా కొంత విరాళాలను సేకరించి పంచలోహ ఆంజనేయస్వామి విగ్రహాన్ని తెప్పించడం జరిగింది. అనంతరం పట్టణంలో ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని ఊరేగించనున్నారు.

రొంపిచెర్లలో ఘనంగా హోలీ సంబరాలు 04సీటీఆర్21, 22

**రొంపిచెర్ల మేజర్ న్యూస్ :** మండలంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాజస్థాన్ రాష్ట్రం నుంచి వలస వచ్చి ఇక్కడ వ్యాపారాలు చేస్తున్న



వ్యాపారులు, స్థానిక ప్రజలతో కలిసి ఆనందోత్సాహాల మధ్య హోలీ పండుగ వేడుకగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నేమిచంద్ పటేల్, ఓం ప్రకాష్, పంచారామ్, మహేష్, నాని, సాయి, రాఘవేంద్ర, సూరి, దీపక్, సోను, జగదీష్, నార్పట్ రవి, సచిన్, అర్జున్, కైలాష్, వేణు ఆచారి, మునికృష్ణమాచారి, శంకర్ల మదన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి



**పెనుమూరు, మేజర్‌న్యూస్:** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం పెనుమూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాల్లో ఇలా ఉన్నాయి. పెనుమూరు మండలం స్వామి రెడ్డి పల్లి పంచాయతీకి బొట్టు వారి పల్లి గ్రామానికి చెందిన మునస్వామి కుమారుడు బి గోవింద్(45) అనే వ్యక్తి పెనుమూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద అర్జీలు రాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం భోజనానికి అని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై పెనుమూరు నుండి ఉగ్రాణం పల్లి బయలుదేరాడు మార్గమధ్యం లోని కారకంపల్లి గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద చిత్తూరు నుండి పెనుమూరు వైపుకు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదంలో గోవింద్ స్పృహ కోల్పోయాడు, అదేవిధంగా మరో ద్విచక్ర వాహనదారులైన పాకాల మండలానికి చెందిన బాబు(53), వెదురుకుప్ప మండలానికి చెందిన రెడ్డప్ప ఆచారి (65) ఇరువురు కూడా తీవ్ర గాయాలు పాలయడంతో స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను పెనుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీంతో వైద్యాధికారులు క్షతగాత్రులను చికిత్సలు అందిస్తుండగా గోవింద్ మృతి చెందినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. ఈ మేరకు పెనుమూరు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి గోవింద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## ప్రభాకరన్ హత్య కేసులో నిందితులు ముగ్గురు అన్నదమ్ముల అరెస్ట్

**– నిందితుల నుంచి రెండు కత్తులు, బైక్ స్వాధీనం**

**– పాత కక్షలతోనే కిరాతక హత్య: నిందితులకు రిమాండ్**

**సూళ్లూరుపేట మేజర్‌న్యూస్ :** తిరుపతి జిల్లా తడ మండలం పెరియవట్టు గ్రామంలో గత నెల 28న సంచలనం సృష్టించిన ప్రభాకరన్ హత్య కేసును పోలీసులు ఎట్టి కేలకు ఛేదించారు. ఈ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను బుధవారం ఉదయం తడ పోలీసులు తడ రాఘవ కాంప్లెక్స్ పక్కన పాతబడిన హాస్టల్ భవనంలో నిందితులు దాకున్నట్లు సమాచారం అందడంతో వారిని అరెస్ట్ చేశారు. అనంతరం డీఎస్పీ చెంచు బాబు మీడియాతో మాట్లాడుతూ,నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నాం. హత్యా పెరియవట్టు మెయిన్ రోడ్డులో టైర్ పంచర్ షాపు నడుపుకుంటున్న ప్రభాకరన్‌తో, అదే గ్రామానికి చెందిన వి. దినేష్, వి. సతీష్ అలియాస్ అప్పు, వి. విగ్నేష్ అలియాస్ విక్కీ అనే ముగ్గురు అన్నదమ్ములకు పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో గత నెల 28వ తేదీ సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో, ప్రభాకరన్‌ను అంతమొందించాలనే ఉద్దేశంతో ముగ్గురూ బైక్‌పై షాపు వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ప్రభాకరన్‌పై కత్తులతో విచక్షణారహితంగా తలపై, ముఖంపై, మెడపై నరికి అతి కిరాతకంగా చంపి అక్కడి నుండి పరారయ్యారు. నిందితులపై తడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 33/2026 ప్రకారం కేసు నమోదు చేసి, వారిని రిమాండ్ నిమిత్తం సూళ్ళూరుపేట కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసిన సూళ్లూరుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి క్రిష్ణ నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, సూళ్లూరుపేట ఎస్సై అజయ్ కుమార్ , సర్కిల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

## మొబైల్స్, బంగారం దొంగతనం చేసే ఇద్దరు అరెస్ట్

**– దొంగిలించిన మొబైల్ ఫోన్లు, బంగారు నగలు స్వాధీనం**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపిఎస్ ఆదేశాల మేరకు, తిరుపతి టౌన్ డీఎస్పీ ఎం. భక్తవత్సలం ఆధ్వర్యంలో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసులు, ఎస్ఐలు ఓ. రామస్వామి, టీ. ఇమామ్ హుస్సేన్ బాబా ఈస్ట్ పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు చేపట్టి ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. A1: ఇంద్రావత్ పవన్ కుమార్ నాయక్ (24), తలుపుల మండలం, అనంతపురం జిల్లా. A2: ఎరగ అశోక్ (23), కురబలకోట మండలం, అన్నమయ్య జిల్లా. అనంతపురం జిల్లా కు చెందిన ఏ1 ఇంద్రావత్ పవన్ కుమార్ నాయక్ మరియు అన్నమయ్య జిల్లా కు చెందిన ఏ2 ఎరగ అశోక్ కలిసి తిరుపతిలోని విష్ణు నివాసం, శ్రీనివాసం, బస్ స్టాండ్ పరిసర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవలి కాలంలో తిరుపతి విష్ణు నివాసం బస్ స్టాండ్ ప్రాంతాల్లో దొంగతనాలు జరిగిన నేపథ్యంలో బుధవారం 11.00 గంటలకు తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్ గేటు వద్ద దొంగిలించిన బంగారు నగలు సెల్ ఫోన్లు అమ్మేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పోలీసులకు రాబడిన సమాచారంతో అప్రమత్తంగా వ్యవహరించి ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుండి: రూ. 2,50,000 విలువ గల 14 మొబైల్ ఫోన్లు రూ. 3,00,000 విలువ గల 30 గ్రాముల బంగారు నగలు. స్వాధీనం చేసుకున్నారు.విరిపై కేసు నమోదు చేసి నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచారు. ప్రజలు బస్సు స్టాండ్లు, లాడ్జీలు, యాత్రికుల నివాసాల్లో అప్రమత్తంగా ఉండి తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 112కు సమాచారం అందించాలని తిరుపతి జిల్లా పోలీసులు సూచించారు.



## వికలాంగునికి పెన్షన్ మంజూరు

**– సీఎంకి,ఎమ్మార్పీఎస్ బృందానికి కృతజ్ఞతలు**



**రామకుప్పం, మేజర్ న్యూస్:** రామకుప్పం మండలం, బందార్లపల్లి పంచాయతీ, గడ్డురు గ్రామం వికలాంగుడు హనుమంతుకు ప్రభుత్వ వికలాంగుల పెన్షన్ మంజూరు కావడం ఆనందదాయకమైన విషయమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న హనుమంతు సమస్యను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకుల కృషి ఫలితంగా పెన్షన్ ఆమోదం పొందింది.ఈ సందర్భంగా హనుమంతు తన కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం పట్ల ఆయన అభినందనలు వ్యక్తం చేశారు. అలాగే తమ సమస్యను పట్టుదలతో ముందుకు తీసుకెళ్లి పరిష్కారం సాధించిన ఎమ్మార్పీఎస్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి వికలాంగుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తామని, ఎవరికైనా పెన్షన్ లేదా ఇతర సంక్షేమ పథకాల విషయంలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కో ఇంచార్జ్ వెంకటేష్, రామకుప్ప మండల ఇన్చార్జ్ గోవిందప్ప, మండల అధ్యక్షులు జయప్ప, నాయకులు, సర్పంచ్ రాజగోపాల్. కూటమి నాయకులు ఆనందప్ప. ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ హరి. జనసేన భాస్కర్. గిరి. చంద్ర. స్థానిక కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ మహా మండలేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన



**రామచంద్రపురం, మేజర్ న్యూస్:** రాయల చెరువు సమీపంలోని చాయాపురంలోని శనేశ్వరాలయంలో బుధవారం శ్రీ మహామండలేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన ఆలయ ధర్మకర్త ఉంగరాలు సుబ్రమణ్య స్వామి వేద మంత్రోచాల నడుమ భక్తిశ్రద్ధలతోనిర్వహించారు ఈ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి గన్నవరం పీఠాధిపతులు కమలానంద సరస్వతి పితాపురం ఆస్థాన పండితులు సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు ఈ సందర్భంగా మన తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు దక్షిణ భారతదేశంలోనే అత్యంత కళా నైపుణ్యాలతో ఆలయాన్ని నిర్మించినట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయానికి వచ్చిన భక్తులు ప్రజాసంకల్పం పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని డీకే పల్లిలో నూతన విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. వార్డు సభ్యులు, స్థానికులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న కరెంట్ పోల్స్ కొరత పై అధికారులు స్పందించి నూతన విద్యుత్ పోల్స్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. డీకే పల్లిలో విద్యుత్ సౌకర్యాల లోపాన్ని క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం తదితరులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రెస్కో సిబ్బందితో కలిసి అవసరమైన అంచనాలు రూపొందించారు. పరిశీలన అనంతరం డైరెక్టర్ ఆర్ముగం త్వరలోనే నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బుధవారం డీకే పల్లిలో కొత్త విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చర్యతో స్థానికులకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుందని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. నూతన పోల్స్ ఏర్పాటు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు వేలు, నబీ ఉల్లా, సోము, సాయికుమార్, ఊరి గౌడు సత్తి, నాగభూషణం, అల్లా బకాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కాపర్ వైర్లు పంపిణీ

**పెనుమూరు, మేజర్ న్యూస్:** మండల పరిసర ప్రాంతంలోని




వ్యవసాయ బావులు వద్ద గత వారం రోజులుగా బోరు, స్టార్టర్లకు ఉన్న కాపర్ వైర్ల చోరీ జరిగిన విషయం విధితమే అయితే చోరీకి పాల్పడిన దొంగలను కూడా పట్టుకోవడం వారి నుండి దొంగలించిన కాపర్ వైర్ల సొత్తును రిక్వెరీ చేసి వాటిని తిరిగి రైతులకు అందించడం జరిగిందని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంట సాగు చేస్తున్న రైతులకు సాగు చేస్తున్న పంటలను నష్టపోకుండా వారికి సహాయం అందించాలన్న సేవా దృక్పథంతో చోరీకి గురైన రైతులకు వైర్లను అందించడం జరిగిందని తెలిపారు. దీంతో స్థానిక రైతులు ఎస్సై శ్రీనివాసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతులు పోలీస్ సిబ్బంది, డ్రైవర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఎస్వీయూ పరిధిలోని ఏప్రిల్ లో జరిగిన ఎంకాం, ఎంఏ, ఎంఎస్సి రెండో సెమిస్టర్ ఫలితాలు బుధవారం విడుదల చేశారు. విద్యార్థులు సంబంధిత వెబ్సైట్ ద్వారా ఫలితాలను పొందచ్చని డీన్ ఆచార్య సురేంద్ర బాబు, కంట్రోలర్ డాక్టర్ రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. విడుదలైన ఫలితాలలో ఎంకాం, ఎంఏ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఉమెన్ స్టడీస్, ఎంఎస్సీ జాగ్రఫీ, ఆంత్రోపాలజీ ఎన్విరాన్ మెంటల్ సైన్స్ తదితర సబ్జెక్టులకు ఫలితాలు విడుదలైనట్లు పేర్కొన్నారు.

# పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పనకు అధికారులు కృషి చేయాలి

**కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోందని, నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలని, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) జరిగిన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్‌డెస్క్ విధానంలో డిసెంబర్, 2025 నుండి 2440 పరిశ్రమలకు గాను 2323 అనుమతులు ఇచ్చామని మరో 116పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలు పరిశీలన కమిటీ కి అందిన మేరకు 16 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ. 4.52 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపారు. పెట్టుబడి సబ్సిడీ 4, విద్యుత్ సబ్సిడీ 8, సేల్స్ టాక్స్-1, స్టాంప్ డ్యూటీ-3, యూనిట్లకు ఆమోదించారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ప్రింటింగ్ క్లస్టర్, తిరుపతి, కలంకారీ క్లస్టర్, శ్రీకాళహస్తి, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్, ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించి వేగవంతం చేయాలని అన్నారు. అధికారులు వివరిస్తూ నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి రాష్ట్ర స్థాయి ఆమోదం పొంది ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కొరకు పంపారని తెలిపారు. పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు వివిధ శాఖల అధికారుల వద్ద ఉన్న



పెండింగ్ అంశాలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఏపిఐఐసి ద్వారా భూమి కేటాయించిన పరిశ్రమలు వివిధ దశలలో వున్నాయని, ఇంకా ప్రారంభించని వాటిని త్వరిత గతిన ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జోనల్ మేనేజర్లు ఏపిఐఐసి తిరుపతి, నెల్లూరు విజయ భరత్ రెడ్డి, శివకుమార్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణ రెడ్డి, జిల్లాఅగ్నిమాపక అధికారి రమణయ్య, శ్రీసిటీ ప్రతినిధి భగవాన్, కార్మిక శాఖ అధికారి చిన్న లాలప్ప, డిఆర్‌డిఏ పిడి శోభన్ బాబు, లీడ్ బ్యాంకు మేనేజర్ రవి కుమార్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్, ఎపిడిడిఆర్‌డి ఎ.ప్రభావతి, జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



## శ్రీవారిని దర్శించుకున్న నరేంద్ర మోదీ సోదరుడు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని బుధవారం ఉదయం ప్రహ్లాద దామోదరదాస్ మోదీ శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వీరికి ఆలయంలో రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా టిటిడి అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతు మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు త్వరగా శాంతించాలని స్వామివారిని ప్రార్థించా. రష్యా - ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం వెంటనే ముగియాలని ఆకాంక్ష. భారతదేశం అతి తక్కువ సమయంలోనే 'విశ్వగురువు' స్థానాన్ని చేరుకోవాలని కోరుకున్నానన్నారు. నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు, దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాలని శ్రీవారి పాదాల వద్ద వేడుకున్నానన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, తమిళ్ సినీ నటుడు నీలగిరి రవి, సినీ నటి మిత్రావ్ శర్మలు వేరువేరుగా తదితరులు ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వీరికి ఆలయంలో రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా టిటిడి అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.









# విశ్వాసం కల్పించేలా వైద్య సేవలు

**టీటీడీ జేఈఓ (వైద్యం విద్య) డా. ఎ.శరత్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారు, శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయం దర్శనార్థం విచ్చేసే భక్తులు అనుకోకుండా అనారోగ్యానికి గురైన సందర్భాల్లో వారికి మరింత విశ్వాసాన్ని కల్పించే విధంగా సమగ్ర వైద్య సేవలు అందించాలని టిటిడి జేఈవో (వైద్యం, విద్య) డా.ఎ.శరత్ సూచించారు. తిరుచానూరులోని టిటిడి ఉచిత వైద్యశాలను, అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. జేఈవో మాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలో 7 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు, 5 డిస్పెన్సరీల ద్వారా భక్తులకు అత్యవసర వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. తిరుచానూరు తోళ్లప్ప గార్డెన్‌లోని టిటిడి ఉచిత వైద్యశాలలో ఆలయ సమయాలకు అనుగుణంగా వైద్యసేవలు అందించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం 5 నుండి 10 పడకలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తిరుచానూరులో రోజుకు సుమారు 100 నుండి 150 మంది ఔట్‌పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని, మరింత మందికి నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించేలా తగిన ఏర్పాట్లు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అత్యవసర సమయాల్లో చిన్నపాటి వైద్య సహాయం కూడా రోగులకు అపారమైన ధైర్యాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చేరోగులకు నాణ్యమైన మందులతో పాటు, మరింత మనోధైర్యాన్ని కలిగించే సేవలను అందించాలని కోరారు. అనంతరం అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అలిపిరి కేంద్రంలో గ్లోబల్ హాస్పిటల్స్ గ్రూప్, చెన్నై వారు మానవ వనరులను అందిస్తుండగా, అవసర మైన ఔషధాలను టిటిడి సరఫరా చేస్తోందని తెలిపారు. తిరుమలకు చేరే భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన మందులను సమృద్ధిగా నిల్వ ఉంచాలని ఆదేశించారు. భక్తులు అనుకోకుండా అనారోగ్యానికి గురైనపుడు వారికి తక్షణం వైద్యసేవలు అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ డా.కుసుమ కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సుహర్షత, వైద్యుడు డా.సుధాకర్ పాల్గొన్నారు.





జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు. ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116




## ఎఫ్ఆర్ఓకు డిప్యూటీ సీఎం అవార్డు ప్రదానం

**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్:** మంగళవారం మంగళగిరిలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) బి. సుదర్శన్ రెడ్డి అవార్డు అందుకున్నారు. అటవీ శాఖలో తన విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి ఉన్నత అధికారుల ప్రశంసలను అందుకున్నారు. ఈ కారణంగా ఎఫ్ఆర్ఓ సుదర్శన్ రెడ్డికి ప్రభుత్వం అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేయడం జరిగింది.

## ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండా తోనే సాధ్యం

**గూడూరు మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం ఎర్ర జెండా తోనే సాధ్యమవుతుందని గూడూరు సీపీఐ నియోజవర్గ కార్యదర్శి జి శశి కుమార్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గూడూరు నియోజకవర్గ సమితి సమావేశంలో భాగంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థ ఉన్నంతకాలం ఎర్రజెండా అవసరమని తెలిపారు. రాష్ట్రంలో మెడికల్ మాఫియాను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయిందన్నారు. మెడికల్ మాఫియాపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అదే విధంగా పేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నివేశ స్థలాలు, ఇంటి నిర్మాణం కొరకు ఐదు లక్షల రూపాయలను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్మికులు, కర్షకులు , బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు.

## గూడూరు సీపీఐ పట్టణ కమిటీ ఏకగ్రీవం



**గూడూరు మేజర్‌న్యూస్:** గూడూరు పట్టణ సిపిఐ కన్వీనర్‌గా యాదల సునీల్‌ను ఎంపిక చేశారు. బుధవారం గూడూరు పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సునీల్ మాట్లాడుతూ నూతన కమిటీలో కన్వీనర్‌గా నియమించిన పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా గూడూరు పట్టణ సీపీఐ కో కన్వీనర్ గా కె నారాయణను ఎంపిక చేశారు. అనంతరం పలువురికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ కార్యదర్శి శశి కుమార్ ,సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఇన్సాఫ్ నాయకులు జమాలుల్లా, వెంకటేష్, మోహన్, చైతన్య రెడ్డి, భార్గవ్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫ్యాడ్లు పంపిణీ

**గంగాధర్ నెల్లూరు మేజర్ న్యూస్:** పాలసముద్రం మండలంలోని ఆముదాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నాడు మండల టిడిపి అధ్యక్షులు తాళ్లూరి శివ విద్యార్థులకు ఫ్యాడ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ చదువుపై ప్రత్యేక దృష్టి సారించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తల్లిదండ్రులు ఎంతో పడి చదివిస్తున్నారని దానిని



దృష్టిలో ఉంచుకొని బాగా చదివి తల్లిదండ్రులకు వారి ఊరికి మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు తరువాత బాలకృష్ణాపురం తారు రోడ్డును పనులను ఆయన పరిశీలించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుల్ నాదన్ టిడిపి నాయకులు శేఖర్ రాజు రోసి నాయుడు నవీన్ నాయుడు జనసేన నాయకులు గోపి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గుత్త వసూలు హక్కునకు బహిరంగ వేలం

**నగరి మేజర్ న్యూస్ :** నగరి పురపాలక సంఘము 2026-27 ఆర్థిక సం॥ ప్రతిఫలము ఇచ్చు వనరులు 1. వారపుసంత (నగరిం సత్రవాడ) 2. దినసరిమార్కెట్ 3. బస్టాండు 4. టాక్సీఆటోలు 5. జంతువధశాల మొ॥లగు వాటిపై గుత్త వసూలు చేసుకొను హక్కునకు బహిరంగ వేలము నిర్వహించబడినది. సదరు బహిరంగ వేలము పాటయందు, ఈ దిగువ తెలిపిన మార్కెట్లకు గుత్తదారులు హెచ్చుపాట పాడి గుత్త రుసుములు వసూలు చేసుకొను హక్కు కైవసము చేసుకొవడం జరిగినది వాటి వివరములు:వారపుసంత (నగరిం సత్రవాడ)ఎం. హరిబాబు రూపాయలు21,55,000,దినసరిమార్కెటసి.ఎం. భాస్కర్ రూపాయలు 21,00,000, బస్టాండు ఎస్. రామమూర్తి రూపాయలు 10,70,000 టాక్సీఆటోలుఎం.యోవాన్ రూపాయలు 13,40,000 కానీ సదరు జంతువధశాలకు సంబంధించి వేలము పాట తేది: 10.03.2026 మంగళవారమునకు ఉదయం 11.00 గం॥లకు వాయిదా వేయడమైనది.

## గ్రామాల్లో ప్రజా భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపిఎస్., ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ తమ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు వెళ్లి ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల ద్వారా ప్రస్తుత కాలంలో పెరుగుతున్న వివిధ రకాల నేరాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన



కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, అనుమానాస్పద ఫోన్ కాల్స్, ఓటీపీ మోసాలు, లింకులు, ఆన్‌లైన్ లోన్లు, సోషల్ మీడియా మోసాలు వంటి అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని, తెలియని లింకులు క్లిక్ చేయవద్దని సూచించారు. ఏవైనా సైబర్ మోసాలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అలాగే విద్యార్థులు మంచిగా చదువుకొని, మంచి ప్రవర్తనతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, చెడు అలవాట్లు మత్తు పదార్థాల నుండి దూరంగా ఉండాలని సూచించారు. యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని, చట్టాలను గౌరవిస్తూ నడుచుకోవాలని అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు జిల్లా పోలీసులు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొంటూ, ఏదైనా వేధింపులు, సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112 కు కాల్ చేయాలని తెలిపారు. ప్రతి సమస్యకు పోలీసులు అండగా ఉంటారని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందిస్తూ, పోలీస్--ప్రజల మధ్య విశ్వాసాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.






## జిల్లా ఎస్పీని సన్మానించిన జై సింగ్

**పలమనేరు మేజర్ న్యూస్ :** పలమనేరు పట్టణంలోని రాజస్థాన్ కు చెందిన మార్వాడీలు ఘనంగా హోలీ పండుగను నిర్వహించుకున్నారు.





ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడే కు పసుపు కుంకుమ పూసి అక్కడ సంబరాలు చేసుకున్నారు. అనంతరం చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడే కి శాలువా కప్పి స్వీట్ అందించి హోలీ పండుగ శుభాకాంక్షలు పలమనేరు పట్టణానికి చెందిన జై సింగ్, తిరుమల తిరుపతి దేవస్థానానికి కూరగాయలు పంపిణీ చేసే కాపల్లి గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి తెలియజేశారు.

## పాడి రైతుల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం గంధమనేని జయశంకర్ నాయుడు

**ఎస్ ఆర పురం మేజర్ న్యూస్:** పాడి రైతుల అభివృద్ధి లక్ష్యం అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు మండల పశు వైద్య కేంద్రంలో గడ్డి కత్తిరించే యంత్రాల పంపిణీ కార్యక్రమం మండల పశు వైద్య అధికారి శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పాడి రైతులకు యంత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాడి రైతుల అభివృద్ధి చెందాలని ఆలోచనతో గడ్డి కత్తిరించే యంత్రాలను 50 శాతం సబ్సిడీ ద్వారా అందిస్తోందని అన్నారు. ఈ యంత్రాలు 40,500 రూపాయలు అయితే పాడి రైతులకు 20250/- రూపాయలకు అందిస్తోందని తెలిపారు. పాడి రైతులను అభివృద్ధి తో వారు ఆర్థికంగా ఎదగాలని వారికి అన్ని రకాల బ్యాంకుల్లో రుణ సౌకర్యం కూడా అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో జీడి నెల్లూరు నియోజకవర్గం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ సహకారంతో అభివృద్ధి చెందుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, మండల పశువైద్యాధికారిని శ్రీవిద్య, సింగల్ విండో చైర్మన్ నిరంజన్ రెడ్డి, బూత్ కన్వీనర్ చిరంజీవి, నాయకులు నోమేష్ రెడ్డి, లోకేష్ ,దశరథన్, మధు, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి - సిపిఐ నేత మించల శివకుమార్

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** తిరుపతి నగరంలో ఏప్రిల్ లో జరిగే అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ 18వ మహాసభలను జయప్రదం చేయాలని బుధవారం ముళ్ళపూడి ఎస్టి కాలనీలో సిపిఐ నేత మించల శివకుమార్ ఆధ్వర్యంలో గడపగడపకు కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఎఐటియుసి నాయకత్వంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలలో అత్యంత ప్రధానమైన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయాలని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిర్ణయించి 2025 నవంబర్ 21 నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం ఫ్యాక్టరీస్ యాక్టు కార్మిక నష్టపరిహార చట్టం వంటి ముఖ్యమైన చట్టాలు రద్దు చేయబడతాయి అన్నారు. కార్మిక సంఘాలు పెట్టుకోవాలన్నా తమ



కోర్కెల కోసం సమ్మెలు చేయాలన్నా అవకాశం లేని విధంగా కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడలను రూపొందించిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చే నాలుగు కార్మిక కోడ్ లు రూపొందించారని నాలుగు 4 కోడ్ లను రద్దు చేయాలని అప్పటివరకు పార్టీ ప్రజా సంఘాలు ఆందోళనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. తిరుపతిలో జరిగే మహాసభలకు అన్ని కార్మిక వర్గాలు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తేమ్మ సీనయ్య లక్ష్మమ్మ అంకమ్మ కాంతమ్మ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నోబెల్ స్కూల్‌లో... అగ్ని ప్రమాదాలపై అవగాహన

**శాంతిపురం, మేజర్‌న్యూస్:**

అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని,చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి అన్నారు. తుమ్మిసి రోడ్డుకు నందుగల నోబెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలు (ఫైర్ సేఫ్టీ) అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురేష్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సాధారణంగా ప్రజల నిర్లక్ష్యంతో జరుగుతాయని అన్నారు.

కుప్పం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నేతాజీ మాట్లాడుతూ విద్యుత్ పరికరాల భద్రత, గ్యాస్ స్టవ్ ప్రమాదాల గురించి, పెట్రోల్ డీజిల్ తదితర మండే పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఇంట్లో మంటలను ఆర్పే ఫైర్ ఎక్స్టింగ్విషెర్ ను ఏర్పాటు చేసుకోవాలని అగ్నిప్రమాదం జరిగిన వెంటనే 101 నెంబర్ కి ఫోన్ చేయాలని తెలిపారు. ఫైర్ ఆఫీసర్,ఫైర్ మాన్ తో కలిసి గ్యాస్ లీక్ అయి మంటలు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిన్సిపాల్ నాగలక్ష్మి ప్రాథమిక ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



# మేమున్నాం.. మీ భద్రత మా బాధ్యత..

**తిరుపతి జిల్లా పోలీస్ శాఖ**

**"పల్లెనిద్ర" కార్యక్రమం ప్రజలకు భరోసా, సమస్యలకు పరిష్కారం**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు "పల్లెనిద్ర" కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉందనే భరోసాను కల్పిస్తూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలోభాగంగా గ్రామాలను సందర్శించి, గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. గ్రామంలోని స్థానిక సమస్యలు, భద్రతా అంశాలు, శాంతిభద్రతలకు సంబంధించిన విషయాలను తెలుసుకొని అవసరమైన సమాచారం సేకరించాను. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, సూచనలు, అభ్యర్థనలను గమనించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా సూచనలు అందించారు. అదేవిధంగా, సైబర్ భద్రత, రోడ్డు భద్రతా నియమాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగింది. ఆన్‌లైన్ మోసాల నుండి ఎలా రక్షించుకోవాలి, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ఎంత ముఖ్యమో వివరించబడింది. అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యపరచడం జరిగింది. తిరుపతి జిల్లా పోలీసులు ప్రజలతో కలిసి నడుస్తూ, సమస్యల పరిష్కారంలో ముందుండి, గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నారు. "మేమున్నాం – మీ భద్రత మా బాధ్యత" అనే నినాదంతో పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువవుతోంది.



# అంగన్వాడి సహాయకురాలు నియామకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం మండలాలలోని అంగన్వాడీ సహాయకురాలు ఉద్యోగాలకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి శోభారాణి తెలిపారు. దరఖాస్తు చేయదలచుకున్న వారు స్థానికులై, 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల లోపు వయసు గలవారు ఉండాలన్నారు. మార్చి 6 నుండి మార్చి 16 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేయదలుచుకున్న వారు పదవ తరగతి పాసై ఉండాలన్నారు. మండలాల వారిగా వెదురుకుప్పం మండలం గిరిగిదొన ఏఏడబ్ల్యు ఎస్‌సి–3, గోవింద వారి పల్లి ఓసి, నక్కలాంపల్లి ఎస్సీ–3, పూల వారి కండ్రిగ ఈడబ్ల్యూఎస్, గొల్లపల్లి ఎస్సీ–3, ఎర్రగుంట ఓసి, పెరుమాళ్ళపల్లి ఓసి, చెంచుగుడి ఓసి, చింతలగుంట హెచ్ డబ్ల్యు ఎస్ సి–2, గుర్రం వారి కండ్రిగ ఓసి, శ్రీరంగరాజపురం మండలంలో చొక్కామడుగు ఓసి, అనంతరాజు పురం ఈడబ్ల్యూఎస్, పుల్లూరు క్రాస్ బిసి–బి, సింధు రాజపురం బీసీ డీ, బసిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ ఎస్సీ–3, డి కమ్మ కండ్రిగ ఓసి, పాస్ నచున్మిట్ట ఎస్టి, జంగాలపల్లి ఓసి, దుర్గరాజపురం హెచ్ డబ్ల్యు ఎస్ సి–3, మర్రిపల్లి హెచ్ డబ్ల్యు ఎస్ సి –3, సి బాపనపల్లి హెచ్ డబ్ల్యు ఎస్ సి–2. గా ఉన్నాయని, ఎవరికైనా అనుమానాలు ఉంటే ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని సంప్రదించాలని ఆమె కోరారు.

# మన భూమి–మన హక్కు

**చర్చి ఆస్తుల పరిరక్షణకు ఉద్యమ ర్యాలీ**

**ఎస్‌సిఎల్‌సి సంఘ సభ్యులు**

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** పుత్తూరు పట్టణంలోని చర్చి కాంపౌండ్‌కు చెందిన విలువైన ఆస్తుల అంశాన్ని ఆంధ్రప్రభ వెలుగులోకి తీసుకురావడంతో క్రైస్తవ సంఘాలు స్పందించాయి. చర్చి ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. "మన భూమి–మన హక్కు", "క్రైస్తవ భూమి పరిరక్షించాలి" అనే నినాదాలతో చర్చి కాంపౌండ్ నుండి తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. చర్చి స్థలంలో నిర్మించిన ఫ్లాట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లపై పూర్తి స్థాయి విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. చర్చి కాంపౌండ్‌కు చెందిన సుమారు రూ.40 కోట్ల విలువైన ఆస్తిని రూ.1,07,17,000లకు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెల్లూరు సబ్–రిజిస్ట్రార్ కార్యాలయంలో 2024 ఏప్రిల్ 29, 30 తేదీల్లో జరిగిందని తెలిపారు. పుత్తూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంబంధిత భూమికి ల్యాండ్ కన్వర్షన్ జరగలేదని, లేఅవుట్ వేయాలంటే తగిన అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించినట్లు సమాచారం. అప్రూవల్ లేకుండా లేఅవుట్ వేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, ఆంధ్రప్రభలో వార్త వెలువడిన నేపథ్యంలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగస్వాతి స్పందిస్తూ, సంబంధిత రిజిస్ట్రేషన్ నంబర్‌పై బుధవారం నుంచి తదుపరి ప్రక్రియను నిలిపివేసినట్లు వెల్లడించినట్లు సమాచారం. తరతరాలుగా చర్చి కాంపౌండ్‌లో అనాధ శరణాలయం నిర్వహిస్తూ సుమారు 150 మంది పిల్లలు, వృద్ధులు, విధవలు, హెచ్ఐవీ బాధితులకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శరణాలయం ముందు గోడ నిర్మాణం మానవతా విలువలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. వన్–బి, అడంగల్ రికార్డుల ప్రకారం భూమి ఇప్పటికీ చర్చి కాంపౌండ్‌గా నమోదై ఉందని, ఈ నేపథ్యంలో భూమి రిజిస్ట్రేషన్‌పై అనుమానాలు వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు. క్రిష్ణ సముద్రం, బుచ్చినాయుడు కండ్రిగ, నందిమంగళం, పుత్తూరు టౌన్, భీముని చెరువు, పచ్చికాపల్లం, వేపగుంట, తిరుమలకుప్పం, నింద్ర, నాగలాపురం తదితర ప్రాంతాల క్రైస్తవులు ఐక్యంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఏఎల్‌సి సంఘ సభ్యులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రెవెన్యూ ఆఫీసర్ ఆర్.శేషమ్మరాజుకి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం



పుత్తూరు సబ్ రిజిస్టర్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ నాగస్వాతికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం



పెంచలయ్య రెవెన్యూ ఆఫీసర్, రవి రెవెన్యూ సర్వేయర్, పుత్తూరు మున్సిపాలిటీ.. వినతి పత్రం అందిస్తున్న దృశ్యం